ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
మంగళవారం 21 జనవరి 2025



నేడు తాగు నీటి సరఫరా నిలిపివేత

పెద్దపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణ, మండలం, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఓదెల, ఎలిగేడు, మండలాలు, పాలకుర్తి మండలంలోని కొన్ని గ్రామాల్లో మంగళవారం తాగునీటి సరఫరా జరగదని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కె.పూర్ణచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గంలోని ముర్మూరు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద సంపు పైప్‌లైన్ నిర్వహణ పనుల నిమిత్తం నీటి సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ప్రజలు గమనించాలని ఈఈ తెలిపారు.

మూడు రోజుల నీటి సరఫరా బంద్

పెద్దపల్లిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు పట్టణంలో తాగు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్ సెట్లు, హెయిర్ వాల్స్ మెయింటెన్స్‌లో భాగంగా మంగళ, బుధ, గురు వారాల్లో తాగు నీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు,

నేడు జిల్లాస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, వకృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులు పాల్గొంటారని, రాణించిన విద్యార్థులు ఈనెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డీఈవో మాధవి పాల్గొంటారన్నారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వం



- కొత్తగా నాలుగు పథకాలకు శ్రీకారం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికకు క్షేత్ర స్థాయిలో సర్వే
- అభ్యంతరాల స్వీకరణ, అర్హుల ఎంపిక
- నేటి నుంచి 23 వరకు ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాల ద్వారా పారదర్శకంగా లబిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారం నుంచి ప్రభుత్వ యంత్రాంగం ప్రజల ముంగిటకు రానున్నది. పదేళ్ల తర్వాత సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తోంది. ఆయా పథకాలకు ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ద్వారా ఎంపిక చేసిన జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి అనర్హులుంటే వారిని తొలగించి అర్హులను ఎంపిక చేయనున్నారు. ఇప్పటి వరకు ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకోలేని వాళ్లు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

26 నుంచి పథకాల అమలు

ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పలు హామీల్లో భాగంగా మరో నాలుగు పథకాలను ప్రజల ముంగిటకు తీసుక వచ్చేందుకు శ్రీకారం చుడుతోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈ నెల 26వ తేదీ నుంచి అమల్లోకి తీసుక రానున్నారు. ఇందు కోసం గతేడాది ప్రజా పాలన గ్రామ, వార్డు సభల్లో స్వీకరించిన దరఖాస్తులతో పాటు సమగ్ర కుటుంబ కుల గణన సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని అనుసరించి ప్రభుత్వం జిల్లా అధికారులకు జాబితాలను పంపించడంతో వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లిన సిబ్బంది యాప్ లో వివరాలను నమోదు చేశారు. మొదటి విడతలో ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 10,500 ఇళ్లు మంజూరు చేయగా, సొంత స్థలం గల లబ్ధిదారులనే ఎంపిక చేసి గ్రామసభ ఆమోదం కోసం పెట్టనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 1,80, 664 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,28,972 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాల్లో 61,692 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అర్హులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో మొదటి విడత ఇంటి స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. ప్రధానంగా గుడిసెలో ఉన్న వారికి, పాత ఇళ్లపై టార్పాలిన్లు కప్పి ఉన్న గృహాల కుటుంబాలకు, అనాథలు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఎలాంటి భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, సఫాయి కర్మచారి, అట్టడుగున ఉన్న గిరిజనులకు మొదట ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా...

2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు గ్రామీణ ఉపాధి కూలీ పనులకు వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో

మిగతా 8వ పేజీలో

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

- ప్రధానోపాధ్యాయుడిపై దాడికి నిరసనగా..



కనగర్తి పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

8

మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి

- రేపు పెద్దపల్లిలో సభ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య

8

ఏటీసీ సెంటర్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ఏటీసీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఐటీఐ సెంటర్ ప్రాంగణంలో జరుగుతున్న ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 6 ట్రేడ్‌లతో యువతకు ఉపాధి శిక్షణ అందించేందుకు ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీసీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, జనవరి నెలాఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేసి పరికరాలను అమర్చేందుకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. పరికరాలు వచ్చాయని, భవన నిర్మాణం పూర్తయితే 25 రోజులలో పరికరాలను అమర్చి యువతకు శిక్షణ తరగతులు ప్రారంభించవచ్చని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. చివరి దశలో ఉన్న భవన నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం - రైతులకు శాపం

రుణమాఫీకి నోచుకోని 54 మంది రైతులు ● వెనక్కి వెళ్ళిన నిధులు ● బ్యాంకు ఎదుట నిరసన



కేడీసీసీ బ్యాంక్ ఎదుట రైతుల నిరసన

రామగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ తప్పిదం రైతులకు శాపంగా మారింది. బ్యాంకులోని తమ అప్పును రెన్యూవల్ చేసుకున్న ఖాతాదారులకు పాత ఖాతాను మూసివేసి కొత్త ఖాతా నెంబరు జారీ చేయడంతో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. ఖాతాదారులకు పాత ఖాతా నెంబరులో రుణమాఫీ డిపాజిట్ చేసే వీలు లేకపోవడంతో మాఫీ మొత్తం డబ్బు తిరిగి ప్రభుత్వ ఖాతాలోనే జమ అయ్యింది. సుమారు 54 మంది రైతులు రుణమాఫీ కోసం 7 నెలలుగా బ్యాంక్ మేనేజర్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మేనేజర్ కాలయాపన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు సోమవారం బ్యాంక్ ఎదుట నిరసన చేపట్టారు. ఒకే రైతుకు రెండు ఖాతా పుస్తకాలు ఎలా జారీ చేస్తారని అడిగినా సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. గత మేనేజర్ చేసిన తప్పిదంతో రుణమాఫీ అందలేదు. దీంతో రైతుల ఖాతాల్లో రూ.50లక్షల 12వేలు జమ కావాల్సిన డబ్బులు ప్రభుత్వానికి తిరిగి వెళ్ళాయి. రుణామాఫీ జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు తెలిపారు.

సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి

గాంధీ నాయక్, బ్యాంక్ మేనేజర్ వివరణ

ఖాతాదారులకు సంబంధించిన రుణమాఫీ సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. కేడీసీసీ బ్యాంక్‌లోని 54 మంది ఖాతాదారులకు సంబంధించిన రుణాలు రూ. 50లక్షల 12 వేలు మాఫీ కాని రైతుల వివరాలతో కూడిన నివేదికను బ్యాంక్ ఉన్నతాధికారులకు పంపాం. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్, రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ, మేయర్ బంగి అనీల్ కుమార్ అన్నారు. సోమవారం స్వశక్తి మహిళలు ఏర్పాటు చేసుకున్న మొబైల్ ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వశక్తి మహిళలు క్యాంటీన్లు, స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, శంకర్‌నాయక్, నాయకులు ఎల్లయ్య, నగరపాలక సంస్థ ఈఈ రామన్, మెప్మా డీఎంసీ మౌనిక, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.



మొబైల్ ఫుడ్ కోర్టును ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్

రైతుబంధు పక్కదారి

- సినిమాటాకీస్, వాణిజ్య సముదాయాలకు...
- ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సైతం
- సర్వేలో వెల్లడయిన వాస్తవాలు
- రైతుభరోసా వర్తించకుండా చర్యలు



సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్, సినిమా టాకీస్ వద్ద వద్ద సర్వే చేస్తున్న తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో సాగు చేయని భూములకూ కొన్నేళ్ళుగా రైతుబంధు పొందుతున్నారు. సాగుకు బదులు ఫంక్షన్ హాల్స్, సినిమా టాకీసు, రైస్ మిల్లులు, వాణిజ్య సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సైతం రైతుబంధు ద్వారా లబ్దిపొందారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో ఈ విషయాలన్నీ బయటపడుతున్నాయి. ఇన్నేళ్లు రైతు బంధు నిధులు పొందిన ఘనుల బండారాన్ని అధికారులు బట్టబయలు చేశారు.

సాగుకు యోగ్యం కాని భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసింది. మండలంలో కొన్ని రోజులుగా అధికారులు సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో రైతు బంధు పేరిట ఇప్పటి వరకు లక్షలు, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా దుర్వినియోగం చేశారో, ఆ అక్రమాలు వెలుగు చూశాక పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంత గుడ్డిగా అధికారులు రైతుబంధు నిధులు అనర్హులకు కట్టబెట్టారేనని ఆశ్చ ర్యపడుతున్నారు. ఎనాడూ గుంట భూమిలో సాగు చేయకున్నా కూడా రైతుబంధు పేరిట ప్రభుత్వం నుంచి డబ్బులు పొందారు.

పట్టణంలో నలభై ఎకరాల గుర్తింపు రైతుభరోసాకు అనర్హులుగా నమోదు

తహసీల్దార్ మధుసూధన్ రెడ్డి

ఇప్పటి వరకు సుల్తానాబాద్ పట్టణంలో రైతు బంధు నిధులు పొందుతున్న నలభై ఎకరాలను గుర్తించాం. అందులో సాగుకు బదులు ఫంక్షన్ హాల్స్ సినిమా టాకీసు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. ఇవి ఉన్నా కూడా రైతుబంధు పేరిట లబిపొందారు. వీటిని తాము గుర్తించి రైతు భరోసాకు అనర్హులుగా నమోదు చేశాం. వీరికి ఇక ముందు రైతు భరోసా డబ్బులు పడకుండా నిలిపివేశాం. ఇంకా ఇలాంటి ఉంటే ఎవరైనా తమ దృష్టికి తీసుకురావాలి. అనర్హులను తొలగించి అర్హులకు భరోసా కల్పిస్తాం.



అధికారుల సర్వేలో వెల్లడవుతున్న అక్రమాలు

రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు సుల్తానాబాద్‌లో సర్వే చేస్తున్నారు. సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించడంలో జరుగుతున్న సర్వేలో అధికారులు అనేక విషయాలు గుర్తించారు. పట్టణంలోని కరీంనగర్ రోడ్డును ఆనుకుని 892, 893 సర్వే నంబర్లలో ఒక ఎకరం నాలుగు గుంటలలో ఉన్న యశోద నరహరి ఫంక్షన్ హాల్, వాణిజ్య సముదాయానికి రైతు బంధు పొందుతున్నారు. అలాగే పెరికెగిద్దె అంజనేయ స్వామి ఆలయం సమీపంలోని సర్వే నంబర్ 776 పరిధిలో ఎకరం 28 గుంటలలో ఉన్న శ్రీరామా టాకీస్ పేరిట ఉన్న భూములకు, దాని సమీపంలోని 852 సర్వే నంబర్‌లో ఎకరం పది గంటలలో ఉన్న ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్, రియల్ ఎస్టేట్ వెంచర్స్‌కు, 28 ఇటుకబట్టీలకు రైతుబంధు నిధులు జమ అవుతున్నాయని గుర్తించామని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, వ్యవసాయాధికారి స్వప్న తెలిపారు.

ఆర్టిజన్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలి



దీక్షకు మద్దతు తెలిపిన గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఆర్టిజన్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. డిమాండ్లు పరిష్కరించాలని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద సోమవారం ఆర్టిజన్లు చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఒకే శాఖ ఉద్యోగులకు వేర్వేరు సర్వీసు రూల్స్‌తో ఆర్టిజన్లకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఆర్టిజన్లను విద్యుత్ ఉద్యోగుల రూల్స్‌లో చేర్చి కన్వర్షన్ చేయాలని గుజ్జుల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టిజన్లను కన్వర్షన్ చేస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలన్నారు. దీక్షలో జాక్ చైర్మన్ మల్లారి కిషన్ రెడ్డి, కన్వీనర్ మట్ట రాజు, కోచైర్మన్లు దుర్గం విశ్వనాథ్, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లయ్య, కో కన్వీనర్లు రఘు, సందీప్, కోశాధికారి దేవేందర్, రవి, పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమ

మంథని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో మంథని మున్సిపల్‌లోని 13 వార్డుల్లో సమగ్రాభివృద్ధికి తమ పదవికాలంలో కృషి చేసినట్లు చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన చివరి సమావేశంలో ఆమె మాట్లాడారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.13.95 కోట్లతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ నూతన భవనం, డంపింగ్ యార్డు, ఇతర అభివృద్ధి పనులు, సెంట్రల్ లైటింగ్, మార్కెట్ నిర్మాణం, ఆర్టీసి బస్టాండ్ విస్తరణకు నిధులు మంజూరు చేయించామన్నారు. 11, 13 వార్డులకు సంబంధించి ఎంఎస్ఆర్ (ముస్కుల నారాయణరెడ్డి)నగర్‌గా, డబుల్ బెడ్ రూం ఏరియాను శివనాగపురి కాలనీగా నామకరణం, పవర్‌హౌజ్ కాలనీని శ్రీపాద కాలనీగా, శ్రీపాద కాలనీలో 5 గుంటలు బీసీ కమ్యూనిటీ హాల్, మరో 5 గుంటలు గోశాల ఏర్పాటుకు తీర్మానించినట్లు తెలిపారు. కమిషనర్ మనోహర్, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభలు

మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో మంగళవారం నుంచి వార్డు సభలు జరుగుతాయని చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. మూడు రోజుల్లో వార్డు ఆఫీసర్లు పూర్తి చేస్తారని తెలిపారు. కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ప్రదర్శిస్తారన్నారు. జాబితాల్లో పేర్లు లేని అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సమాశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ వేడుకలు కలెక్టరేట్‌లో జరుగుతాయని, ప్రతీ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది ప్రశంసాపత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ప్రోసిడింగ్స్ పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఏసీపీ జి.కృష్ణ, పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభించిన సీపీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం జోన్ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం సీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక చేస్తారు. సీపీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ఎంత ప్రతిభ కనబరిచారన్నదే ముఖ్యమన్నారు. క్రీడల ద్వారా శరీర దారుఢ్యం పెరగడంతోపాటు పని ఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేష్, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్, పీడీలు శ్రీనివాస్, విజయకుమార్, వివిధ జిల్లాలకు చెందిన లాన్ టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి


లింగన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన పిట్లం లింగన్న (41) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. లింగన్న ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లి మరునాడు వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. లింగన్న తల్లిదండ్రులకు అనారోగ్య సమస్యలతో చికిత్సకు, పంట సాగుకు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. భార్య పిట్ల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


ఆశన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్ గ్రామానికి చెందిన రెబ్బసి ఆశన్న(72) అనే వృద్ధుడు సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆశన్న భార్య రెబ్బసి శాంత మూడు నెలల క్రితం మరణించగా తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మంచంపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కొడుకు రెబ్బసి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నాట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో సోమవారం ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన పదమూడు సంవత్సరాల బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి పారిపోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హైదరాబాద్‌లో పట్టుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పాత అరుణ్‌కుమార్ అనే వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. పదిహేను రోజుల క్రితం అక్రమంగా 1.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైన పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యమైంది. సోమవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. బాలిక మెట్‌పల్లిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల కారణంగా ఇంటి వద్దే ఉంది. ఈ నెల 15న తల్లికి తెలపకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన రాసం రాకేష్ ప్రేమపేరుతో వేధించేవాడని, అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- విపత్తులను ఎదుర్కొనేందుకు 'ఆపద మిత్ర'ల నియామకం
- జిల్లాలో 300 మంది వలంటీర్ల ఎంపిక
- స్థానిక ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవకాశం
- మొదటి దశలో 59 మందికి 12 రోజుల శిక్షణ



అత్యవసర సమయాల్లో అండగా..

కరీంనగర్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవిం చినప్పుడు సరైన సమయంలో సహాయం అందక తీవ్ర నష్టం జరుగుతోంది. సమాచారం అందుకుని ప్రభుత్వ యంత్రాంగం అక్కడికి చేరుకునే ఆలస్యమవుతోంది. ఇలాంటి నష్టాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చే వారికి 'ఆపద మిత్ర' కింద విపత్తులు ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తు న్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య శాఖ, పశుసంవర్థక శాఖలకు చెందిన జిల్లా అధికారులు వలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పి స్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము కాటు, కుక్కకాటు, అగ్ని ప్రమాదం, విద్యుదాఘాతం, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపద మిత్ర శిక్షణ తీసుకున్న వలంటీర్లు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

● స్థానికులకు ప్రాధాన్యం

ఆపదమిత్రలుగా శిక్షణ తీసుకున్న వారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరకుంటారు. నష్టం జరగకుండా.. బాధితులకు అండగా ఉంటారు. వరదలో చిక్కుకున్న వారు ఉంటే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటారు. అవసరమైన ప్రభుత్వ శాఖలకు ఎప్పటి కప్పుడు సమాచారం అందజేస్తారు. మొదటి దశలో జిల్లాలోని 59 మంది వలంటీర్లకు ఆపదమిత్ర కింద శిక్షణ ఇచ్చారు. స్థానికులకే ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని అధికారులు సూచిం చారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయాల్లో ఆస్తులు రక్షించడం, మనుషులు, జంతువుల ప్రాణాలను కాపా డడం, వరదల్లో కొట్టుకు పోతున్న వ్యక్తిని రక్షించడం వంటి అంశాల్లో శిక్షణ దిగువ మానేరు జలాశయంలో శిక్షణ ఇచ్చారు. తిమ్మాపూర్ మండలం నల్గొండలో నాలుగు ఫైరింజన్‌లతో ఫీల్డ్ ట్రైనింగ్ అందించారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఆపదమిత్ర కోర్స్ కోఆర్డినేటర్ అయిన జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఈ శిక్షణ కొనసాగింది.

● ప్రత్యేక రక్షణ కిట్లు....

మొదటి దశలో శిక్షణ పొందిన 59 మంది ఆపద మిత్రలకు త్వరలోనే ప్రత్యేక రక్షణ కిట్లను అందజేయనున్నారు. ఈ కిట్లలో స్పెషల్ గాగుల్స్, ఫైర్‌ప్రూఫ్ హెల్మెట్, లైవ్‌జాకెట్స్, షూ, రోప్, ఇతర రక్షణకు సంబంధించిన పరికరాలు, వస్తువులుంటాయి. ఈ రక్షణ కిట్లను త్వరలోనే శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలకు అందించనున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు శిక్షణ అందిస్తున్నామని కోఆర్డినేటర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

శునకాల స్వైర విహారం

ఓదెల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గూడెంలో రెండు రోజుల క్రితం రియాన్షు అనే చిన్నారిపై దాడి చేయడంతో మొఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓదెల పొత్కపల్లి, మడకలో రెండు రోజుల క్రితం దాడులకు పాల్పడ్డాయి. సోమవారం నాటు వేయడానికి వెళుతున్న కూలీలపై కుక్కలు కరవడంతో గాయాలకు గురై సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట అనుబంధ గ్రామమైన రామన్నపల్లికి చెందిన బత్తుల మల్లయ్య (28) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మల్లయ్య ఇంటి పనులపై బయటకు వెళ్లి ఇంటికి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. గ్రామ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడిపోగా తలకు గాయాలై మృతి చెందాడు. మృతుడు మల్లయ్య భార్య రేణవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


తెరిచి ఉన్న బీరువా

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. మూడు రోజుల క్రితం ఊరెళ్లిన ఇంటి యజమాని సోమవారం రాత్రి తిరిగి రావడంతో దొంగతనం వెలుగు చూసింది. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వంగల శ్రీనివాస్ భాగ్య దంపతులు మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో సుల్తానాబాద్ వచ్చారు. ఇంటి తాళం తీసి ఉండడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దొంగలు తాళం ఊడదీసి లోపలికి చొరబడి బీరువాలను తెరిచి సామాన్లను కింద పడేశారు. హాల్‌లోని టీవీని ఎత్తుకెళ్లారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏ మేరకు చోరీ జరిగిందనేది తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


టీఎన్‌జీవో డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కట్కూరి నాగుల నరసింహ స్వామి, శ్రీకాంత్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, రూరల్ అధ్యక్షుడు వాస్తవిక్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, రామస్వామి, శంకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కామ సతీష్, గిరిధర్‌రావు, శంకర్, మహిళ నాయకురాళ్లు శారద, సునీత, హరిప్రియ, లత, సరిత, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, గాజుల నర్సయ్య, ఎల దాసరి లింగయ్య, రమేశ్, గోవిందపతి శ్రీనివాస్, పత్తేంశ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం

● గేదెపై దాడి ● భయాందోళనలో ప్రజలు


ముస్తాఫానగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. ముస్తాఫనగర్‌కు చెందిన రాసమల్ల రాజు అనే రైతుకు చెందిన గేదెపై దాడిచేసి చంపేసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ అధికారి రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని చిరుతగా అధికారులు నిర్ధారించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పొలాల వద్దకు రాత్రి వేళల్లో రైతు లు వెళ్లొద్దని, కొట్టాల్లో పశువులను ఉంచరాదని రేంజ్ అధికారి కల్పనదేవి సూచించారు.

● మండలంలో వరుస ఘటనలు

గంభీరావుపేట మండలంలో చిరుత సంచరిస్తూ వరుస దాడులకు పాల్పడుతోంది. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ సమీప వ్యవసాయ పొలాల వద్ద ఉన్న గేదెలపై అప్పట్లో చిరుత దాడి చేసి హతమార్చింది. ముచ్చర్ల ప్రాంతంలో రెండు మూడుసార్లు చిరుత దాడులకు తెగబడింది. అదే క్రమంలో గోరంటాల సమీప అడవుల్లో కూడా మేకల మందపై చిరుత దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. మల్లుపల్లె బ్రిడ్జి వద్ద ఇటీవల చిరుత అడవి పంది పిల్లలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో దమ్మన్నపేట సమీప అడవుల్లో చిరుత సంచరించింది. పలు గ్రామాల్లో చిరుత సంచారం అధికమవుతుండటంతో గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఒకే చిరుత ఇన్ని గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరిస్తుందా లేక చిరుతల సంఖ్య పెరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

లొట్టి పోయి.. బాటిల్ వచ్చె..


తాటి చెట్టుకు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది. ప్లాస్టిక్ భూతం కల్లు కుండలకు కూడా తాకింది. కుమ్మరి కులస్తులు చేసిన కుండలను కల్లుకోసం తాటి చెట్లకు కడుతుంటారు. మట్టి కుండల తయారీ తక్కువ కావడం, మరో వైపు వాటి ధరలకు కూడా పెరిగిపోవడంతో గౌడ కులస్తులు కొన్ని చోట్ల తాటి చెట్టుకు కుండలకు బదులుగా ప్లాస్టిక్ బాటిల్స్ కడుతున్నారు. సుద్దాల గ్రామ శివారులో తాటిచెట్టుకు కట్టిన వాటర్ బాటిల్స్‌ను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. మార్కెట్‌లో కుండలు లభించక ప్లాస్టిక్ బాటిల్స్ కట్టినట్లు గౌడ కులస్థులు పేర్కొంటున్నారు. వీటిని చెట్లకు కట్టడం సులభంగా ఉందన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.55 వేల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సోమవారం వేకువజామున జరిగిన రెండు అగ్నిప్రమాదాల సంఘటనల్లో రూ.55 వేల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. కరీంనగర్ శివారులోని తీగలవంతెన సమీపంలోని సోహెల్ హోటల్(దాబా)లో ఉదయం 4:30 గంటలకు మంటలు అంటుకోవడంతో వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది ఫైరింజన్ వాహనంతో వెళ్లి మంటలను ఆర్పివేశారు. హోటల్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని రిఫ్రిజిరేటర్, వంట నూనె, ఇతన ఆహార ముడి పదార్థాలు దగ్ధమయ్యాయని, వాటి విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని హోటల్ యజమాని ఆసిఫ్‌ఖాన్ ఫిర్యాదు చేశాడని అధికారులు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని వీఆర్‌ఆర్ నగర్‌లో ఇంటి పక్క ఖాళీ స్థలంలో కర్రలకు మంటలు అంటుకొని దగ్ధమమయ్యాయి. ఫైరి సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు 5 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బందుకు శ్రీనివాస్, అతని కుమారుడు నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 19న ఆనందం భార్య పుష్పలత, కొడుకు కరుణాకర్, జగన్‌లు తమ వ్యవసాయ పొలానికి చేరుకోగా శ్రీనివాస్, నరేశ్‌లు అడ్డుకోవడంతో పాటు కర్ర, గడ్డపార, కొడవలితో దాడి చేసి గాయాపరిచారని చెప్పారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో చిట్టి డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి కోమాలోకి పోవడానికి కారణమైన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్య అదే గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ అనే వ్యక్తుల మధ్య చిట్టి డబ్బుల విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ గొడవలో బైక్ పైన ఉన్న సమ్మయ్యను శ్రీనివాస్ కిందకి తోసి తలపై కొట్టడంతో బలమైన గాయమైంది. దీంతో సమ్మయ్య కోమాలోకి పోయా డని అతని భార్య కొలిపాక నిర్మల కల్లూరు శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి సోమవారం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వివాహితను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కతెరపాక దిలీప్ అనే యువకుడు తరచూ వివాహితను వెంబడించడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన తుమ్మ ప్రసాద్ (40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తుమ్మ ప్రసాద్ ద్విచక్ర వాహనంపై శనివారం కనుకుల నుంచి సుల్తానాబాద్ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రసాద్ సోమవారం మృతి చెందారు. మృతుడికి కొడుకు కూతురు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- పెరిగిన వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


తుమ్మన్నపల్లి గ్రామంలో ఇరుకుగా ఉండి.. సైడ్ వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

హుజూరాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఉన్న ఎస్సారెస్పీ కాలువ పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వంతె నలు ఇరు కుగా మారడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వంతెనలకు ఇరువైపులా దెబ్బతిన్న సైడ్ వాల్స్

మండలంలోని కొత్తపల్లి, తుమ్మనపల్లి, ఇప్పలనర్సింగాపూర్, సైదాపూర్ రోడ్డు, కేసీ క్యాంపు వద్ద, పెద్దపాపయ్యపల్లి గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ కాలువపై చాలా ఏళ్ల క్రితం వంతెనలు నిర్మించారు. వాటికి ఇరువైపులా సైడ్‌వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీళ్లు నిండుగా పారుతుండగా, సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కానరాని సూచికలు :

ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన వంతెనల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై మూడు చోట్ల ఉన్న వంతెనలు పూర్తిగా ఇరుకు గా మారాయి. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనల సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే భారీ వాహనదారులు నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెన సైడ్‌వాల్స్‌కు మరమ్మతులు చేయించి, వంతెనల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరంగా మారింది

- భాషవేని రాజేష్‌యాదవ్, వాహనదారుడు, సింగాపూర్



తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా మారింది. దీనికి తోడు బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండటంతో సామర్థ్యానికి మించి లోడుతో లారీలు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో ఈ బ్రిడ్జి సమీపంలో వీధి దీపాలు సైతం లేకపోవడం, బ్రిడ్జి సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతి

- ఖోఖోలో విశ్వ విజేతలుగా భారత జట్లు
- మహిళల జట్టుకు కోచ్‌గా జిల్లా వాసి


భారత జట్టుకు సూచనలు ఇస్తున్న నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: గ్రామీణ క్రీడ ఖో-ఖోకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. పల్లెల్లో, పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులు ఆడుకునే ఖో-ఖో ఆటలో మహిళలు, పురుషుల విభాగాలలో మన జట్లు విశ్వవిజేతలుగా నిలిచాయి. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్


ప్రపంచ కప్‌ను ముద్దాడుతున్న కోచ్ నరేష్

ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచకప్ పోటీల్లో 23 దేశాలు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన మహిళల ఫైనల్స్ మ్యాచ్‌లో భారత జట్టు నేపాల్ జట్టుతో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసి తొలి ప్రపంచకప్‌ను తన ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో భారత జట్టు నేపాల్‌పై 54-36 పాయింట్ల తేడాతో గెలుపొంది ప్రపంచకప్‌ను ముద్దాడింది. ప్రపంచ చాంపియన్‌గా భారత్‌ను నిలపడంలో ఉమ్మడి కరీంనర్ జిల్లా ధర్మారం బంజరుపల్లి తండావాసి ఇస్లావత్ నరేష్ ముఖ్య భూమిక పోషించారు. నరేష్ భారత మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 30 రోజులపాటు శిక్షణను అందించి భారత్‌ను ప్రపంచ చాంపియన్‌గా నిలిపాడు.

ఖో-ఖో మహిళల జట్టు కోచ్ ఇస్లావత్ నరేష్ నేపథ్యం

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఖో-ఖోలో భారత మహిళల జట్టు ప్రపంచ కప్ గెలవడంలో ధర్మారం మండలం లంబాడితండా (బి)కు చెందిన ఇస్లావత్ నరేష్ కీలక పాత్ర పోషించారు. ఖో-ఖోలో అద్భుత ప్రతిభ చూపి భారత్ మహిళల జట్టు కోచ్‌గా నియమి తులయ్యారు. ఆయన శిక్షణలో రాటుదేలిన జట్టు ప్రపంచ చాంపిన్‌గా నిలిచింది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడితండా (బి) గ్రామానికి చెందిన ఇస్లావత్ రూపానాయక్-సాంతారీల కుమారుడు ఇస్లావత్ నరేష్. వీరిది ఓ సాధారణ వ్యవసాయ కుటుంబం. నరేష్‌కు చిన్ననాటి నుంచి ఆటలంటే మక్కువ. హుస్నాబాద్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువ ుకున్న ఆయన ఖో-ఖోలో పలు పథకాలు సాధించారు. 2006లో రైల్వే శాఖలో సౌత్ సెంట్రల్ నాందేడ్ డివిజన్‌లో ఉద్యోగం సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన రైల్వే శాఖ తమ జట్టుకు 2016లో కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణ తీరును గమినించి స్పోర్ట్స్ ఫెడరేషన్ నరేష్‌ను ప్రపంచ కప్‌లో భారత మహిళా జట్టుకు కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణలో రాటు దేలిన క్రీడాకారులు ప్రపంచ చాంపియన్లుగా నిలిచారు.

ఖో-ఖోతో ఉజ్వల భవిష్యత్తు



- ఇస్లావత్ నరేష్, భారత మహిళల జట్టు కోచ్

ఖో-ఖో క్రీడతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఈ క్రీడతో పలు సంస్థలు ఉద్యోగావ కాశాలు కల్పిస్తున్నాయి. ప్రపంచ చాంపియన్లుగా నా శిక్షణలో భారత జట్టు నిలిచింది. 2027లో ఇంగ్లాండ్‌లో ప్రపంచ కప్ వరకు చీఫ్ కోచ్‌గా ఎదగాలనుకుంటున్నాను.

ఖో-ఖోకు ఒలింపిక్స్‌లో స్థానం కల్పించాలి..



- వై మహేందర్‌రావు, ఖో-ఖో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖో-ఖో క్రీడకు ఒలంపిక్స్‌లో స్థానం కల్పించాలి. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్టు పది సంవత్సరాలుగా విశేష ప్రతిభ చాటుతున్నాయి. భారత ఖో-ఖో జట్టు కోచ్‌గా మన జిల్లాకు ఎందిన నరేష్ వ్యవహరించడం మనందరికీ గర్వకారణం.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..



- నవీన్‌రాజ్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు

తొలి ప్రపంచకప్ ఖో-ఖో పోటీల్లో భారత్ మహిళల, పురుషుల విభాగాల్లో చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వచ్చే ప్రపంచకప్ పోటీల్లో స్థానం సాధించేందుకు నేను ఇప్పటి నుంచి తీవ్రంగా కృషి చేస్తాను. ఖో-ఖో అంతర్జాతీయ స్థాయికి చేరవడం ఆనందంగా ఉంది.

భారత జట్లకు అభినందనలు....



- గజ్జల భవాని, జాతీయ క్రీడాకారిణి

ప్రపంచ ఖో-ఖో పోటీల్లో భారత జట్లు చాంపియన్లుగా నిలవడం ఆనందంగా ఉంది. మహిళలు, పురుషుల జట్లకు అభినందనలు. గతంలో ఖో-ఖో జాతీయ క్రీడగా మాత్రమే ఉండేది. ఇప్పుడు 23 దేశాలు ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

ఆర్టీసీకి సంక్రాంతి జోష్

- కరీంనగర్ రీజియన్ పరిధిలో రూ.24.71 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కరీంనగర్ రీజియన్ పరిధిలో 24.71 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల పరిధిలో ఈ నెల 7వ తేదీ నుంచి 19 వరకు (13, 14తేదీలు మినహాయించి) ఆయా రూట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర వేసింది. ఇందులో జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ఎక్కువ బస్సు సర్వీసులు నడిపారు.

డిపోల వారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (కోట్లలో)	కిలోమీటర్ల (లక్షల్లో)	ఈపీకే	ఓఆర్	ప్రయాణికులు (లక్షల్లో)
గోదావరిఖని	3.69	6.01	61.43	98	7.53
హుస్నాబాద్	1.37	2.46	55.69	98	3.60
హుజూరాబాద్	1.75	2.88	60.80	107	4.12
కరీంనగర్-1	2.70	5.21	51.83	78	5.48
కరీంనగర్-2		3.16	6.36	49.72	80 4.38
మంథని	1.49	2.59	57.45	92	2.54
జగిత్యాల	3.18	5.58	57.08	89	6.33
కోరుట్ల	1.90	2.99	63.38	100	3.74
మెట్‌పల్లి	1.79	2.86	62.74	101	3.86
సిరిసిల్ల	1.84	3.04	60.50	100	3.83
వేములవాడ	1.83	3.23	56.61	94	3.59
రీజియన్	**24.71**	**43.21**	**57.18**	**92**	**48.99**

సిబ్బంది సహకారంతో..

- బి.రాజు, ఆర్టీసీ ఆర్ఎం



సంక్రాంతి పండగ సందర్భంగా ఆయా రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. సిబ్బంది సహకారంతోనే ఇంత ఆదాయం పొందగలిగాం. రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసిన అధికారులతో పాటు సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు. సంస్థపై ఇదే ఆదరణను కొనసాగించాలని కోరుతున్నాం.

రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా కరీంనగర్

- ద్వితీయ స్థానంలో వరంగల్
- మహబూబ్‌నగర్‌కు తృతీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు సోమవారం


చాంపియన్స్ ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా జట్టు

ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు వరంగల్‌పై 18-16 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, ఆదిలాబాద్ నాలుగో స్థానంలో నిలిచాయి. కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. డీఆర్‌వో పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ జిల్లాల కార్యదర్శులు శంకర్, ఎడ్ల ప్రవీణ్ కుమార్, సిరికొండ శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, హనుమంతు, రమే ష్, వీర్‌పాల్, దిలీప్ పాల్గొన్నారు.

17వ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు స్విమ్మింగ్ శిక్షణ

ముస్తాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం రోజున 17వ బెటాలియన్ కమాండెంట్ గంగారాం ఆధ్వర్యంలో బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు ఈత పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు (ఎస్‌డిఆర్ఎఫ్) రాష్ట్రంలో విపత్తు నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనే బెటాలియన్ పోలీసులకు ఈతలో ప్రావీణ్యం కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంభవించే విపత్తు నివారణ చర్యలలో వీరంతా పాల్గొనడానికి ముందస్తుగా శిక్షణ ఇప్పించామని బెటాలియన్ కమాండెంట్ గంగారాం తెలిపా రు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, రమేష్, ఎస్ఐ నరేష్, సంతోష్, శ్రీధర్, 150 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు'ను విజయవంతం చేయాలి

- బీసీ కళాకారుల సంఘం రాష్ట అధ్యక్షుడు దరువు అంజన్న


సమావేశంలో దరువు వేస్తున్న అంజన్న

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఏర్పాటు చేసిన వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేయాలని చెప్పినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి నాలుగు నెలల క్రితం ప్రకటించి తప్పడంతో మరో ఉద్యమం చేయక తప్పడం లేదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాలె శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, భోనగిరి కిషన్, రాచకొండ రోజా, నక్క సతీష్, కొల్లూరి సురేందర్, రాపర్తి రవి, బండ పల్లి మల్లీశ్వరి, భోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి

- రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ఆందోళన


పోస్టుకార్డును ప్రదర్శిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని సోమవారం కోరుట్ల పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపి పోస్టు కార్డు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు పోస్టు కార్డులను పంపించారు. ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీని తపాల కార్యాలయం వరకు నిర్వహించి పోస్టు కార్డును పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాష్‌రావు, పబ్బా శివానందం, గంటేడి రాజ్‌మోహన్, యాకుబ్, నల్లాల లక్ష్మీనారాయణ, ఎండి సైఫొద్దిన్, రాజయ్య, చిలుక గంగారాం, స్వామి, రాజేశ్వర్, లక్ష్మీకాంతం, మల్లయ్య, గోపాల్, శ్రీరాములు, సాబితలీ, నారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.6300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుల్తానాబాద్ కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం సంప్రీత్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో సంప్రీత్ ప్రతిభను చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ లో జరుగునున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నారు. సంప్రీత్‌ను అభినందించారు.

- ఓపెన్ చదరంగ పోటీల్లో విశాల్ ప్రతిభ

ఎలిగేడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో ఈనెల 19న జరిగిన ఇండియా ఓపెన్ చదరంగం పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపెల్లి విశాల్ ప్రతిభకనబ రిచాడు. ఓపెన్ విభాగంలో 7రౌండ్లకు గాను 5రౌండ్లు గెలిచాడు. విశాల్‌కు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు చేతులమీదుగా నగదు బహుమతి ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు ఆర్గనైజర్ నందకిషోర్, వెంకటగిరి, సీనియర్ కోచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

భక్తజన సంద్రం... రాజన్న క్షేత్రం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- దర్శనానికి నాలుగు గంటల సమయం

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కొమరవెల్లి మల్లన్న వారంపట్నంను పురస్కరించుకుని వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవా యితీ. ముందుగా కల్యాణకట్టలతో తలనీలాలు సమర్పిం చుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో నాలుగు గంటలపాటు నిరీక్షించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మ వారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించు కున్నారు.


రాజన్న ఆలయ ఆవరణలో తనిఖీలు చేస్తున్న భద్రత సిబ్బంది

- బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు..

రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జిల్లా బాంబ్, డాగ్ స్క్వాడ్ టీం సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ స్థలాలు, వసతిగదులతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

- స్మార్ట్ టీవీల ఏర్పాటు..

రాజన్న ఆలయంలో నిర్వహించే పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయానికి వచ్చే భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పలు ప్రాంతాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ లడ్డుల కౌంటర్, కోడెమొక్కు క్యూలైన్‌లతో పాటుగా పలు ఓపెన్ స్థలాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయగా రాజన్న ఆలయంలో భక్తులు ఎక్కువగా ఉండే స్థలాల్లో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భారీ ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు


హరికథను చెబుతున్న భాగవతరాణి నాగరాణి

- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి, నాగరాణి, శ్రీరాంభట్టర్ వేర్వేరుగా తమ హరికథతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం వైలెన్ సోలో కచేరి వినయకృష్ణ చేపట్టగా నరహరి, సతీష్ ఆధ్వర్యంలో సంగీత కచేరిని నిర్వహించారు. రతన్‌కుమార్ బృందం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..

త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలను సోమవారం ప్రారంభించి కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 72 సంవత్సరాలుగా వేములవాడ రాజన్న ఆలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న రతన్ కుమార్ బృందం

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

స్వామి, ఎస్ఐ బసంత్‌నగర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గంజాయి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్ఐ: యువకులకు మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్య, ఉద్యోగ అవకాశాలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగించడంతో పాటు మంచి మార్గంలో నడవాలని వివరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్ఐ: రోజు వాహనాల తనిఖీతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టి జరిమానా విధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆలయాల వద్ద దొంగతనాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు తీసుకున్న చర్యలేమిటి?

ఎస్ఐ: గ్రామాల్లో నిరంతరం గస్తీ పెంచడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తూ సమాచారాన్ని సేకరిస్తున్నాం.

నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

కోల్‌సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి అర్హుల ఎంపికకు ఈ నెల 21, 22, 23 తేదీలలో నిర్వహించనున్న వార్డు సభల్లో స్వల్ప మార్పులు చేసినట్టు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన ఉదయం 1, 6, 11, 16, 21, 26, 31, 36, 41, 46, మధ్యాహ్నం 2, 7, 12, 17, 22, 27, 32, 37, 42, 47 డివిజన్‌లలో, 22వ తేదీ ఉదయం 3, 8, 13, 18, 23, 28, 33, 38, 43, 48 మధ్యాహ్నం 4, 9, 14, 19, 24, 29, 34, 39, 44, 49 డివిజన్‌లలో, 23వ తేదీ ఉదయం 5, 10, 15, 20 డివిజన్‌లలో సభలు నిర్వహిస్తామని తెలిపారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న వార్డు నెం1, 7, 13, 19, 25, 31 మధ్యాహ్నం వార్డు నెం 2, 8, 14, 20, 26, 33లో కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికకు మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామ సభలు కొనసాగుతాయన్నారు. ఈనెల 21న ఉదయం సుల్తానాబాద్, కనుకుల, గొల్లపల్లి, కాట్నపల్లి, రేగడిమద్దికుంట, కందునూరిపల్లి, రామునిపల్లి, నారాయణరావుపల్లి, గట్టేపల్లి, అల్లీపూర్, మధ్యాహ్నం కదంబాపూర్, దుబ్బపేట్, నీరుకుళ్ల, మియాపూర్‌లో సభలు నిర్వహిస్తారు. అలాగే 22న ఉదయం సుద్దాల, తొగర్రాయి, భూపతిపూర్, చిన్నబొంకూర్, మంచిరామి, తొగరిపల్లి, చిన్నకల్వల, మధ్యాహ్నం గర్రెపల్లి, పూసాల, నారాయణపూర్‌లో గ్రామసభలు నిర్వహిస్తారు. ఈనెల 23న ఉదయం బొంతకుంటపల్లి, కొదురుపాక, నర్సయ్యపల్లి, దేవునిపల్లి, మధ్యాహ్నం సాంబయ్యపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ గ్రామ సభలలో రేషన్ కార్డులకు అర్హులు, అనర్హుల జాబితాను చదివి వినిపిస్తామన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని 16గ్రామాల్లో సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీవో ఎండీ అలీంలు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21న మద్దిర్యాల, విస్సంపేట, గోలివాడ, టీటీఎస్ అంతర్గాం, ఆకెనపల్లి, సోమనపల్లిలో, 22న బుధవారం కుందనపల్లి, లింగాపూర్, పెద్దంపేట, రాయదండి, అంతర్గాం, బ్రాహ్మణపల్లి, 23న రోజున పొట్యాల, ఎక్లాస్‌పూర్, ముర్మూర్, ఎల్లంపల్లి గ్రామాల్లో గ్రామ సభలు ఉదయం 9గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక కానీ వారు ఆందోళన పడవద్దని, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి కరుణాకర్, నాయబ్ తహశీల్దర్ సతీష్‌రావు, గిర్దావర్లు శ్రీమాన్, రమేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పన్నపేట, బొంపల్లి, పాలితం, కాసులపల్లి, కొత్తపల్లి, మూలసాల, చీకురాయి, రాంపల్లి, హన్మంతునిపేట, సబ్బితం, అందుగులపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వెల్లడించేందుకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుండి 23 వరకు చేపట్టనున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ భూములను దళితులకు పంపిణీ చేయాలి

ఓదెల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను దళితులకు పంపిణీ చేయాలని మడకకు చెందిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోసిక రాజేశం సోమవారం హైదరాబాద్‌లో ఎస్సీ కమిషనర్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే మడకతోపాటు ఇతర గ్రామాల్లో సర్వే చేసి వెలికి తీసిన ప్రభుత్వ భూములను ప్రస్తుతం నిర్వహించే గ్రామ సభల్లో దళితులకు అందజేసి ఆదుకోవాలని కమిషనర్ ను రాజేశం కోరారు.

సహస్రను అభినందించిన ఎమ్మెల్సీ అభ్యర్థి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన పసెడ్ల సహస్ర ఇటీవల కిలి మంజారో పర్వతాన్ని అధిరోహించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణ అభినందించారు. గర్రెపల్లి గ్రామానికి చెందిన సహస్ర పదహారేళ్ల వయస్సులోనే ఆఫ్రికా ఖండంలోని 18 వేల 885 అడుగుల ఎత్తు గల కిలి మంజారో పర్వతాన్ని అధిరోహించి చరిత్ర సృష్టించింది. సహస్ర ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా ఖండంలోని కోసియాస్కో పర్వతాన్ని అధిరోహించడానికి వెళుతున్న సందర్భంగా ఆమెకు హరిక్రిష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి సహాయం

కమాన్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెనుగుపల్లె గ్రామానికి చెందిన భూతలగడ్డల మల్లయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబానికి పుట్ట మధు ఆదేశాల మేరకు రొంపికుంట బీఆర్ఎస్ పార్టీ తరఫున వారి కుటుంబానికి 25కిలోల బియ్యం, 10కిలోల చికెన్ దశదినకర్మ కార్యక్రమానికి అందజేశారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ చిందం తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్యడ రవి, మాజీ సర్పంచ్ నీలం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కొట్టే భూమయ్య, మండల యూత్ ఉపాధ్యక్షుడు భాస్కర్, మాజీ వార్డు మెంబర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కళ్యాణ్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ కార్యవర్గం సోమవారం గౌతమినగర్‌లోని వాసవి క్లబ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా గుండా రమేష్, ప్రధాన కార్యదర్శిగా మోద శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. కటకం హరీష్, ఇల్లందుల కిశోర్ మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవలను విస్తరించాలని సూచించారు. అనీల్ కుమార్, అనంతుల రాజశేఖర్, అల్లంకి లచ్చయ్య, గడ్డం రవీందర్, బాలమోహన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



మూలసాల పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదంతో ఇటీవల తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ మండలంలోని మూలసాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రధానోపాధ్యాయునిపై దాడి చేసిన అగంతకులపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ హయ్ జావిద్, దబ్బెట రాములు, బైరి రమణయ్య, అంకతి సంజీవ్, లోకిని సదానందం, మానుపాటి రాజయ్య, కూకట్ల తిరుపతి, బాదం జ్యోతి పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాములు పై దాడి చేసిన గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కనగర్తి దాసరి పద్మ, హన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేస్తూ, ఫ్లకార్డులను ప్రదర్శించారు. పాఠశాలలోకి అక్రమంగా దుండ గులు ప్రవేశించి దాడి చేయడం హేయ మైన చర్య అన్నారు. విష్ణు, రామ చందర్, రజాక్, రజిత, మొండయ్య, వెంకటరమణ, వెంకటస్వామి, రాజ పాపయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై గత నెల 23న కొందరు వ్యక్తులు బడిలోకి చొరబడి విచక్షణారహితంగా మూకదాడికి పాల్పడిన ఘటనను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిచాయి. దాడికి పాల్పటిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేశాయి. ఆదాడిని నిరసిస్తూ ఈరోజు రాష్ట్రశాఖ పిలుపిమేరకు పిఆర్టియి టిఎస్ కమాన్‌పూర్ మండలశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. మండల విద్యాధికారి ఐ.విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు గసిగంటి రమేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మేరుగు రాజమౌళి, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, సీనియర్ సభ్యులు రజనీవందన, లక్ష్మీనారాయణ, సతీష్, రాజేశ్వర్‌రావు, నఫీజూలాఖాన్, ఈశ్వరయ్య, నంబయ్య, రజితకుమారి, సరళ, రేణుక పాల్గొన్నారు.



కమాన్‌పూర్‌లో ఉపాధ్యాయుల నిరసన

విద్యార్థులు ప్రయోజకులైతే గురువులకు సంతృప్తి



సుల్తాన్‌పూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎలిగేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రయోజకులైతేనే గురువులకు సంతృప్తి కలుగుతుందని ఎంఈవో నరేంద్రచారి అన్నారు. సోమవారం సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2002-2003బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు ఆగయ్య, నర్సయ్య, సుదర్శన్, తిరుపతిరెడ్డి, సరోజినీసీతారామ్, సత్యనారాయణ తదితరులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ స్రవంతిమోహన్‌రావులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకొని, పాఠశాలలో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలకు తమవంతుగా రూ.30వేల విలువైన 10బెంచీలను విరాళంగా అందించారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, వెంకటేష్, క్రాంతి, నరేందర్, తిరుపతి, సంధ్య, రజిత, స్వప్న, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు బాధ్యతాయుతంగా ఉండాలి



సూపర్‌వైజర్లతో సమావేశంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లు బాధ్యతాయుతంగా ఉండాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆర్జీ-3, ఏపీఏ ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లతోపాటు 18 మంది జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలకు ఎంవీటీసీలో శిక్షణ ముగింపు కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అధికారులు రామ్మోహన్, కొలిపాక నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు.

ప్రాజెక్టులో పనులు సత్వరం ప్రారంభించాలి

అడ్రియాల ప్రాజెక్టులో కాంట్రాక్టు పనులను సత్వరం ప్రారంభించాలని వెన్సర్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గనిలో వెన్సర్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టు పనులను ఏప్రిల్‌లోపు చేపట్టాలని ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అధికారులు నాగేశ్వర్‌రావు, యాదయ్య, వెన్సర్ కంపెనీ ప్రతినిధులు కరుణాకర్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఫైనాన్స్ లిట్రసి నేరు సంధ్యారాణి అన్నారు. సోమవారం తుర్కల మద్దికుంట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల రక్షణకు భేటీ బచావో భేటీ పడవో పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆడపిల్లలకు అండగా ఫోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టాలు ఉన్నాయని వివరించారు. ప్రతీ ఒక్కరికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, రాజు పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా మహిళ సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం లో సోమవారం జిల్లా సంక్షేమ అధికారి పి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వీవో సమావేశం జరిగింది.



తుర్కలమద్దికుంట పాఠశాలలో అవగాహన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకం మహిళల సాధికారత కోసమని తెలిపారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్లు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో అల్లం పూర్ణచందర్ రావు, ఏపీవో కొమురయ్య లావణ్య, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం టూటౌన్ పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. షిర్కే, తెలంగాణ చౌరస్తాల్లో ట్రాఫిక్ రూల్స్‌ను వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే సీట్ బెల్ట్ ధరించాలని ఎస్సై సురేష్ సూచించారు. నిర్లక్షపు డ్రైవింగ్ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్స్ కనకయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌ను పరామర్శించిన ప్రతినిధులు

ధర్మారం జనవరి 20 (ఆంధ్రజ్యోతి) ధర్మారం ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వేర్వేరుగా పరామర్శించారు. రూప్లానాయక్ తండ్రి రత్నానాయక్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తిరుపతి రెడ్డి, అఖిల్ ఉన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో నిక్షయ్‌శివర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం టీబీవ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ టీబీ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. దగ్గు, జ్వరం, ఆకలి మందగించుట, తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ నిర్ధారణ పరీక్ష నిర్వహించి మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, పిహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, వినీత్, ఏఎన్ఎం సరోజన, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి

గోదావరిఖని, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 22న జరిగే మంద కృష్ణ మాదిగ సభ విజయవంతానికి సోమవారం మాదిగ ఐక్య వేదిక, మాదిగ మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు భుషిపాక సంతోష్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, మాదిగమిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటగిరి పాపయ్య మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో వేయి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమానికి తరలి వెళ్లాలన్నారు. రామగుండం నియోజకవర్గం మాదిగ ఐక్యవేదిక కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే కాజీపేట లింగన్న, కో కన్వీనర్‌గా మాదిగమిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపయ్యతోపాటు 25 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నాయకులు స్వామి, వడ్డేపల్లి శంకర్, పర్లపెల్లి రవి, రేణిగుంట్ల సాగర్, కార్పొరేటర్ భాస్కర్, యాకన్న, దాసరి ఎల్లన్న, తడగొండ నర్సయ్య, పర్వతాలు, ఈదునూరి నర్సింగ్, కార్పొరేటర్ కాలువల సంజీవ్, రాజేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు చిలుక శంకర్, సీపీఐ శనిగారపు చంద్రశేఖర్, ప్రీతం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు ఈనెల 22న పెద్దపల్లిలో నిర్వహించే సన్నాహకసభకు కళాకారులు అధికసంఖ్యలో తరలిరావాలని లక్షడప్పులు, వేయి గొంతుకల మండల అధ్యక్షుడు బుర్ల తిరుపతి కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లిలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో జరిగే సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. రాజయ్య, ఉపాధ్యక్షుడు సతీష్, తిరుపతి, స్వామి, రజక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఈ నెల 22న జరగనున్న మందకృష్ణ మాదిగ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు అంబాల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మంథని చందు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ లక్ష డప్పులు, లక్ష గొంతులతో హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సు సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కవులు, కళాకారులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు. నరేష్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగ వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బహుజన సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్ కోరారు. ధర్మారం గ్రామంలో సన్నాహక సమావేశంలో మాట్లాడారు. మంథని లక్ష్మణ్, సత్యం, శ్రీనివాస్, ఏట రవి, మొండి, రాయమల్లు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు ప్రభుత్వం

5వ పేజీ తరువాయి

2023-24లో ఆధార్ సీడింగ్ అయిన కూలీలు 1,19,062 మంది ఉండగా, ఇందులో 79,974 మంది కూలీలు ఉపాధిహామీ పను లకు వెళ్లగా, 20 దినాల పాటు పని చేసిన కూలీలు 39,326 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ఎలాంటి భూములు లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. వ్యవసాయ శాఖాధికారులు తీసిన లెక్కల ప్రకారం జిల్లాలో 2 లక్షల 80 వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. ఈ భూములు కలిగిన రైతులందరికీ రైతు భరోసా పథకం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి 12 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వే ద్వారా రేషన్ కార్డులు లేని కుటుంబాలు 15,255 మంది ఉన్నారని గుర్తించారు. ప్రజాపాలన గ్రామసభల్లో అనేక దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కులగణన సర్వే దరఖాస్తుల ఆధారంగానే లబ్ధిదారులను గుర్తించేందుకు నాలుగు రోజుల నుంచి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితాలో తమ పేరు లేదని, తాము ఇచ్చిన దరఖాస్తులను పరిగణన లోకి తీసుకోలేదని ఆందోళనకు గురయ్యారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం గ్రామ, వార్డు సభల సందర్భంగా ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని, సభలకు రాని వాళ్లు మండల పరిషత్, మున్సిపల్ కార్యాల యాల్లో గల ప్రజాపాలన కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ కమలాకర్

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని శ్రీవాణీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువక కేంద్రం, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, యువజన వాలంటీర్ రేషవేణి మహేష్, దీరజ్ వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్, శ్రీవాణి విద్యా సంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక తదితరులు పాల్గొన్నారు.

బావిని శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పాలకుర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని తాగునీటి బావిలో ఉన్న వ్యర్థాలపై 'తాగునీటి శుభ్రతపై పర్యవేక్షణ కరువు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైంది. గ్రామ పంచాయతీ ప్రత్యేకఅధికారి జ్యోతి, మాజీ సర్పంచ్ ముక్కెర రాజకుమారి, కార్యదర్శి నారాయణలు స్పందించి సోమవారం బావిలోని చెత్తాచెదారాన్ని సిబ్బంది చేత తొలగించి శుభ్రం చేసి బ్లీచింగ్ ఫౌడర్ కలిపారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో సోమవారం అన్నదానం చేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వనజ వెంకటరమణ దంపతుల కుమార్తె స్రవంతి నాగేంద్ర బాబుల పెళ్లి రోజు పురస్కరించుకుని అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల పెళ్లి రోజు, పుట్టిన రోజులను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, కందునూరి కుమార్, చిట్టవేణి సదయ్యగజబీంకార్ పవన్, ఎనగందుల సతీష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం పరిశీలన

పాలకుర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంటూరుపల్లి శ్మశాన వాటిక స్థలాన్ని సోమవారం తహసీల్దార్ జ్యోతి, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్‌లు పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన రాగం కొమురమ్మ దహన సంస్కారాలను ఓ వర్గం అడ్డుకుందని వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు వారు తెలిపారు. ఆర్ఐ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బూడిద చెరువుకు సాగు భూములు ఇవ్వం

అంతర్గాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ నుంచి వచ్చే బూడిదను బూడిద చెరువులోకి మళ్లించేందుకు తమ భూములు ఇవ్వమని మొఘల్ పహడ్ గ్రామస్థులు తహసీల్దార్ రవిందర్ పటేల్‌కు వినతి పత్రం ఇచ్చారు. బూడిద చెరువుతో జీవనోపాధితోపాటు వాతావరణం కలుషితమై పలు ఇబ్బందులు చవి చూస్తామన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూములను రెండో బూడిద చెరువుకు తీసుకునేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం ప్రయత్నిస్తుందని, భూములు ఇవ్వమని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని/మంథనిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, మండలంలోని పలు గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పరామర్శించారు. పట్టణంలోని పవర్‌హౌజ్ కాలనీలో చింతపట్ల బుచ్చయ్య దశదిన కర్మకు వెళ్లి, అడ్తి వ్యాపారి లింగమూర్తి అల్లుడు సందీప్‌కుమార్ ఇటీవల మృతి చెందగా లింగమూర్తిని, గంగాపురిలో అనారోగ్యంతో బాధ పడుతున్న బత్తుల శంకర్, అడిచర్ల కనుకయ్యలను, స్థానిక 7వ వార్డుల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కొల్లూరి మణికంఠల పరామర్శించారు. మండలంలోని కన్నాల గ్రామంలో బెల్లంకొండ కాంతమ్మ మరణించగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్‌లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ గ్రంథాలయానికి అదనపు సౌకర్యాలు



లైబ్రరీని పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అన్నయ్య గౌడ్

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సోమవారం పట్టణం గ్రంథాలయాన్ని సందర్శించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయంలో ఉన్న వసతి సౌకర్యాలు, ఫర్నీచర్, పుస్తకాలను పరిశీలించారు. అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ సుల్తానాబాద్ గ్రంథాలయానికి ఆరేడు దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు అవసరమైన అన్ని కాంపీటీటీవ్ బుక్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, ఫర్నీచర్‌ను సమకూరుస్తామన్నారు. లైబ్రరీయన్ దీప, వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.